ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన వసతులు

సమావేశంలో మాట్లాడుతున్న పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు పింగళి శ్రీపాల్‌రెడ్డి

- ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి
- టీఎస్‌పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి

మహబూబాబాద్ రూరల్, అక్టోబర్ 8 : ప్రభుత్వ పాఠశాలల్లో రాష్ట్ర ప్రభుత్వం మెరుగైన వసతులను కల్పిస్తుందని టీఎస్ పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు పింగళి శ్రీపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణ కేంద్రంలోని ఎస్‌వీఎం ఫంక్షన్‌హాల్‌లో పీఆర్టీయూ జిల్లా సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శ్రీపాల్‌రెడ్డి హాజరై మాట్లాడారు. ఉమ్మడి రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల్లో అరకొర సౌకర్యాలు మాత్రమే ఉండేవని, ప్రస్తుతం స్వరాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఆధునిక వసతులు కల్పిస్తున్నారన్నారు. అనేకసార్లు మంత్రులు, సీఎం కేసీఆర్‌ను కలిసి ఉపాధ్యాయుల సమస్యలు, పదోన్నతులు, బదిలీలపై చర్చించామన్నారు. అందులో భాగంగానే ప్రస్తుతం ఉపాధ్యాయులు పదోన్నతులు, బదిలీలు అవుతున్నాయన్నారు. తెలంగాణ ప్రభుత్వం పీఆర్సీ గడువులో కమిటీని ఏర్పాటు చేసి ఉద్యోగులకు ఐఆర్‌ను సైతం ప్రకటించడం హర్షణీయమన్నారు. కేజీబీవీ, మాడల్ స్కూల్, గురుకులాల్లో పని చేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్, పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు సంకా బద్రి నారాయణ, ప్రధాన కార్యదర్శి మిర్యాల సతీష్‌రెడ్డి, వెంకటరెడ్డి, రాంజీ, వివిధ మండలాల అధ్యక్ష కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో రామారావు

ఉత్తమ ఫలితాలు సాధించాలి

డీఈవో రామారావు

మహబూబాబాద్ రూరల్, అక్టోబర్ 8 : ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా హెచ్ఎంలు కృషి చేయాలని డీఈవో రామారావు సూచించారు. ఆదివారం పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో బదిలీపై వెళ్తున్న, ఉద్యోగోన్నతి పొంది వచ్చిన హెచ్ఎంలను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తిని సామాజిక బాధ్యతగా భావించి జిల్లాలో మంచి ఫలితాలను తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇస్లావత్ లచ్చిరాం నాయక్, రఘునందన్, వెంకటేశ్వర్లు, పద్మశాంత కుమారి తదితరులు పాల్గొన్నారు.

బాధితుడికి చెక్ అందిస్తున్న ఎంపీపీ ఉమ

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

దంతాలపల్లి, అక్టోబర్ 8 : పేదల సంక్షేమమే బీఆర్ఎస్ ప్రభుత్వ ధ్యేయమని ఎంపీపీ వొలాద్రి ఉమా మల్లారెడ్డి అన్నారు. మండలంలోని దొనకొండ గ్రామానికి చెందిన వెంకన్నకు సీఎంఆర్ఎఫ్ నుంచి మంజూరైన రూ.1లక్ష రూపాయల చెక్‌ను అదివారం రామానుజపురం గ్రామంలో అందజేశారు. ఈ సందర్భంగా అమె మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. రాష్ట్రం ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తూ అభివృద్ధిలో దూసుకుపోతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ చొప్పారి ఉపల్లయ్య, చారి తదితరులు పాల్గొన్నారు.

రామన్నగూడెం ఆకేరువాగు నుంచి ట్రాక్టర్‌లో ఇసుక నింపుతున్న కూలీలు

ఆగని ఇసుక దందా

నర్సింహులపేట, అక్టోబర్ 8 : ఏలాంటి అనుమతులు లేకుండా అక్రమ ఇసుక రవాణా జోరుగా సాగుతుంది. ప్రతిరోజు రాత్రి, పగలు తేడా లేకుండా ఆకేరువాగు నుంచి ఇసుక తోడేస్తున్నారు. మండలంలోని కౌసల్యాదేవిపల్లి, రామన్నగూడెం, జయపురం శివారు వాగు నుంచి ఇసుక తరలిస్తున్నారు. సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో అక్రమార్కులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారిని స్థానికులు ఆరోపిస్తున్నారు. భారీ వర్షాలకు ఇసుక మేటలు వేసింది. ట్రాక్టర్లు వాగులోకి వెళ్లేందుకు డోజర్‌తో దారి ఏర్పాటు చేస్తున్నారు. ఇసుక అక్రమ రవాణ అడ్డుకునేందుకు పోలీసులు దారులు మూసివేసినా కొత్త దారులు ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత రెవెన్యూ, పోలీసు అధికారులు అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని మండల వాసులు కోరుతున్నారు. అక్రమంగా ఇసుక రవాణ చేస్తున్న వారిపై చర్య తీసుకుంటామని తహసీల్దార్ వివేక్ అన్నారు.

వీధి కుక్కల నుంచి కాపాడాలి

చిన్నగూడూరు, అక్టోబర్ 8 : గ్రామాల్లో వీధికుక్కల బెడదను నివారించాలని మండల ప్రజలు కోరుతున్నారు. ఆయా గ్రామాల్లో పిల్లలు, వృద్ధులు, ప్రజలు వీధుల్లోకి రావాలంటేనే జంకుతున్నారు. ఉగ్గంపల్లి, చిన్నగూడూరు, జయ్యారం తదితర గ్రామాల్లో వీధికుక్కలు పలువురిని గాయపరిచిన ఘటనలు అనేకం ఉన్నాయని ఆయా గ్రామాల ప్రజలు తెలిపారు. మండల కేంద్రంలోని ప్రధాన రోడ్డుపై రాత్రి వేళల్లో వీధి కుక్కలు ద్విచక్ర వాహనదారుల వెంటపడుతున్నాయి. ఆందోళనతో బైకు అదుపు తప్పి పడి ప్రమాదాల బారిన పడుతున్న ఘటనలు వారంలో పదుల సంఖ్యలో జరుగుతున్నట్లు తెలుపుతున్నారు. ఇప్పటికైనా ఆయా జీపీ అధికారులు, ప్రజా ప్రతినిధులు కుక్కల బెడద నుంచి కాపాడాలని మండల ప్రజలు కోరుతున్నారు.

మోకుదెబ్బ మండల అధ్యక్షుడిగా వేణు

చిన్నగూడూరు, అక్టోబర్ 8 : గౌడ జన హక్కుల పోరాట సమితి మోకుదెబ్బ మండల అధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన గణగాని వేణును నియమించినట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు రాజేందర్ గౌడ్ వెల్లడించారు.ఆదివారం వేణుకు నియామకపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు భద్రసేనా గౌడ్, సమ్మయ్య, శ్రీనివాస్, మహేశ్, వీరభద్రం పాల్గొన్నారు.

నియామక పత్రం అందిస్తున్న రాజేందర్ గౌడ్

రజక రిజర్వేషన్ సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా జలంధర్

బచ్చన్నపేట, అక్టోబర్ 8 : తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మండలంలోని కొడవటూరు గ్రామానికి చెందిన మినలాపురం జలంధర్‌ను నియమించారు. ఈ మేరకు రజక రిజర్వేషన్ సమితి జాతీయ అధ్యక్షుడు నడిమింటి శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం జనగామలో నిర్వహించిన జిల్లా స్థాయి ఆయన మాట్లాడుతూ రజకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు గోపి, జాతీయ ఉపాధ్యక్షులు ఉల్లెంగుల యాదగిరి, నాయకులు నరేశ్, రాములు, గట్టేశం, రాజు, వీరన్న, ఉపేందర్, కిష్టన్న, లక్ష్మి, సంతోష్, శ్రీను, చంద్రశేఖర్ శేఖర్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

భద్రాద్రిలో పెదమడూరు భజన బృందాల ప్రదర్శన

దేవరుప్పుల, అక్టోబర్ 8 : భద్రాద్రిలోని సీతారామచంద్రస్వామి క్షేత్రంలో రాముడి జన్మనక్షత్రమైన పునర్వసు వేళ మండలంలోని పెదమడూరుకు చెందిన రామదాసు భజన మండల రాష్ట్ర శాఖ అధ్యక్షుడు మాన్యపు సిద్ధేశ్వర్ నేతృత్వంలో భజన మండలి సభ్యులు ప్రదర్శనలు ఇచ్చారు. సీతారామచంద్రస్వామి కల్యాణోత్సవం జరగగా భజన మండలి సభ్యులు భక్తిగీతాలు ఆలపించారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించారు. నాగేశం మహదేవ భజన బృందం సభ్యులు మలిపెద్ది నర్సయ్య, ఎం లక్ష్మి, ఊడుగులు ప్రభాకర్, ఉపేంద్ర, రామదాసు భజన మండలి సభ్యులు కే పద్మ, జీ సునీత పాల్గొన్నారు.

భద్రాద్రిలో పెదమడూరు భజన మండలి సభ్యులు

నీటి సంపులో తాచుపాము..

దంతాలపల్లి, అక్టోబర్ 8 : మండలంలోని కుమ్మరికుంట్ల జడ్పీ పాఠశాలలో నీటి సంపులో తాచుపాము కనిపించడంతో ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. గ్రామానికి తాగునీటి కోసం నిర్మించిన మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్ నిర్మాణ సమయంలో నీటి కోసం ఓడలతో ఏర్పాటు చేసిన నీటి సంపు నిరుపయోగంగా ఉన్నది. కాగా ఇటీవల కురిసిన వర్షాలకు సంపులో నీరు చేరాయి. అదివారం పాఠశాలకు సెలవు కావడంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాఠశాలకు ఎవరూ రాలేదు. ఈ సందర్భంగా పాఠశాల పక్కనే వ్యవసాయ భూమి ఉన్న రైతు నీటి కోసం అటువైపు వెళ్లి సంపులో చూడగా తాచుపాము కనిపించింది. చుట్టూ వ్యవసాయ భూములు ఉండడం వల్ల తరుచూ ఇలాంటి ఘటనలే ఎదరవుతున్నాయని ఉపాధ్యాయులు తెలిపారు. గతంలోనూ ఇలాంటి ఘటనలు ఎదురైనట్లు స్థానికులు తెలిపారు. పాఠశాల చుట్టూ ప్రహరీ నిర్మాణానికి ప్రజాప్రతినిధులు, అధికారులు సహకరించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



నీటి సంపులో ఉన్న తాచుపాము

డ్వాక్రా సభ్యులతో ఏపీఎం శ్రీనివాస్, వెలుగు సిబ్బంది

డ్వాక్రా సంఘాలు బలోపేతం కావాలి

గంగారం, అక్టోబర్ 8 : డ్వాక్రా సంఘాలు బలోపేతమై మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని ఏపీఎం శ్రీనివాస్ సూచించారు. ఆదివారం మండల కేంద్రంలోని రైతు వేదిక సెంటర్‌లో 'నీతి అయోగ్ పథకం'లో భాగంగా డ్వాక్రా మహిళలకు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి మహిళ స్వయం సహాయ సంఘంలో చేరే అవకావం ఉందని దీనిని అర్హులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వివిధ గ్రామాల మహిళలు తయారు చేసిన పరికరాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సీసీ శ్రీరాములు, అరుణ, వీఓఏలు సతీష్, రవి, కన్నయ్య, సూర పాపయ్య, సువార్త తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మయ్య స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న న్యూడెమోక్రసీ నాయకులు

లక్ష్మయ్య ఆశయాలను సాధించాలి

గంగారం, అక్టోబర్ 8 : పేదల కోసం అనేక పోరాటాలు చేసి ప్రాణాలను త్యాగం చేసిన గొగ్గల లక్ష్మయ్య ఆశయాలను సాధించాలని సీపీఐఎంఎల్ జిల్లా కార్యదర్శి గౌని ఐలయ్య అన్నారు. ఆదివారం మండల పరిధిలోని కోమట్లగూడెం గ్రామంలో లక్ష్మయ్య 30వ వర్ధంతి పురస్కరించుకుని పార్టీ నాయకులతో కలిసి స్తూపం వద్ద ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఐలయ్య మాట్లాడారు. ఏజెన్సీ గిరిజన రైతుల కోసం అండగా ఉండి అనేక పోరాటాలు చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు శ్రీశైలం, బూర్క వెంకటయ్య, మోకాళ్ల మురళీకృష్ణ, పుల్లన్న, బుచ్చిరాములు, కాంతారావు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి శిబిరం

దంతాలపల్లి, అక్టోబర్ 8 : మండల కేంద్రంలోని జడ్పీ పాఠశాలలో హనుమకొండకు చెందిన శరత్ కంటి దవాఖాన ఆధ్వర్యంలో అదివారం శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీజ ఆధ్వర్యంలో ఉచితంగా కంటి పరీక్షలు చేసి మందులు అందించారు. కార్యక్రమంలో సిబ్బంది ఊర్మిళ, అంజి తదితరులు పాల్గొన్నారు.

దంతాలపల్లిలో కంటి పరీక్షలు చేస్తున్న డాక్టర్ శ్రీజ